క్లుప్తంగా

ఘనంగా రాఖీ పండుగ



వేణురెడ్డికి రాఖీ కడుతున్న మహిళా నేత కవిత

చిలమత్తూరు: హిందూపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాఖీ పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం నేతలు పార్టీ నాయకుడు వేణురెడ్డి కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మహిళా నేతలకు స్వీట్లు తినిపించారు.

పెనుకొండ/ గోరంట్ల: పెనుకొండతోపాటు గోరంట్ల మండల వ్యాప్తంగా శనివారం రాఖీ పండుగ నిర్వహించారు. మహిళలు, యువతులు తమ సోదరులకు రాఖీలు కట్టి, ఆశీర్వాదం తీసుకున్నారు. బ్రహ్మకుమారీలు సీఐ బోయశేఖర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

మడకశిర/రొళ్ల అమరాపురం: పట్టణంలో శనివారం రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. సరస్వతీ విద్యా మందిరం, బ్రహ్మకుమారి ఈశ్వరి విద్యాలయాల్లో విద్యార్థినులు రాఖీలు కట్టి సోదరభావం చాటుకున్నారు. సరస్వతీ విద్యా మందిరం కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, బద్రీనాథ్, పురుషోత్తం పాల్గొన్నారు. రొళ్ల, అమరాపురంలో అన్నా చెల్లెళ్లు, అన్నా, తమ్ముళ్లకు అక్కా, చెల్లెళ్లు రాఖీలు కట్టారు.

హిందూపురం: పట్టణంలో శనివారం రక్షాబంధన వేడుకలు ఘనంగా జరిగాయి. అక్కచెల్లెలు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి హారతులిచ్చి వారిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. శ్రీకంఠపురం సరస్వతీ విద్యామందిరం చిన్నారులకు సామూహిక రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు స్నేహితులకు అన్నదమ్ములకు రాఖీలు కట్టి చాకెట్లు తినిపించారు.


తమ్మడేపల్లిలో సినిమా షూటింగ్



సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తున్న పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం నంబర్ వన్ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. చిత్ర దర్శకుడు సందీప్, నిర్మాత క్రిష్ణనాగరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, డ్యాన్స్ మాస్టర్ రవి తదితరులు క్లాప్ కొట్టి సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాగేష్ మాట్లాడుతూ.. అమరాపురం గ్రామానికి చెందిన యువకులు బెంగళూరులో స్థిరపడి సొంతంగా గ్రామీణ ప్రాంతంలో 'నంబర్ వన్' సినిమా షూటింగ్ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం దేవాలయ ఆవరణ, గ్రామంలో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. తమ్మడేపల్లి సర్పంచ్ సదానందగౌడ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, డ్యాన్స్ మాస్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు చేయూత



చిన్నారి తండ్రికి నగదు అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన హిదాయత్ కుమారుడు అద్నాన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అల్ ఇందాద్ ట్రస్ట్ సభ్యులు ఆ చిన్నారి చికిత్స కోసం దాతల సహకారంతో ట్రస్ట్ నుంచి రూ.25 వేలను శనివారం చిన్నారి తండ్రికి అందజేశారు. చిన్నారి చికిత్సలకు దాదాపు రూ.10 లక్షల దాకా అవసరం కానున్నదని, దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. ట్రస్ట్ అధ్యక్షుడు అమన్, కార్యదర్శి ఉమర్ ఫారూక్, అర్షాద్, సాధిక్, ఉస్మాన్, హసీబ్, అనీస్ రెహమాన్ పాల్గొన్నారు.

జేడీఎస్ సభ్యత్వ నమోదు



మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్పకు సభ్యత్వ నమోదు పుస్తకాన్ని అందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా వ్యాప్తంగా జేడీఎస్ పార్టీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. కోటగుడ్డ, కడపలకెరె, అరిక్యాతనహళ్లి తదితర గ్రామాల్లో శనివారం నాయకులు జేడీఎస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. అధిక సంఖ్యలో ప్రజలు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, జేడీఎస్ శ్రేణులు ఆర్‌సీ అంజినప్ప, ఎస్ తిమ్మారెడ్డి, ఎన్‌పీ ఈరణ్ణ, సొగడు వెంకటేశ్, కోటగుడ్డ అంజయ్య, రాజశేఖరప్ప, సర్వేశ్వర రెడ్డి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనిపించని పల్లె వెలుగు

- రోడ్డు సౌకర్యం ఉన్నా తిరగని ఆర్టీసీ బస్సులు
- ఆటోలు, టెంపోలే దిక్కు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ఇష్టారాజ్యంగా చార్జీల వసూలు

రొళ్ల: తారు రోడ్డు కలిగిన ప్రతి గ్రామానికి 'పల్లె వెలుగు' బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు ఆచరణలో విఫలమవుతున్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలు 'పల్లె వెలుగు' బస్సులు ఎక్కే అదృష్టానికి నోచుకోవడం లేదు. కేవలం నష్టాలు వస్తున్నాయని సాకుగా చూపించి ఉన్న సర్వీసులను కూడా రద్దు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు టెంపోలు, ఆటోలు, సొంత ద్విచక్ర వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మడకశిర నియోజకవర్గం పూర్తిగా కర్ణాటక ప్రాంతం ఆనుకుని ఉంది. ఈ నియోజకవర్గంలోని 5 మండలాలు కలిపి మొత్తం 367 గ్రామాలు ఉన్నాయి. మడకశిర తాలూకా కేంద్రంలో ఆర్టీసీ డిపో కూడా ఉంది. ముఖ్యంగా రొళ్ల మండలంలో గుడ్డగురికి, జీఎన్ పాళ్యం, క్యాతప్ప పాళ్యం, దాసప్పపాళ్యం, వన్నప్ప పాళ్యం, టీజీ హళ్లి, టీడీ పల్లి, దొడ్డేరి, చర్లోపల్లి తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. ఇలా ఉండగా.. అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో కూడా దాదాపు 200 గ్రామాల్లో 'పల్లె వెలుగు జాడ కనిపించడం లేదంటే నమ్మాల్సిందే.

అవస్థలు పడుతున్న విద్యార్థులు

గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు లేకపోవడంతో సకాలంలో బడులకు వెళ్లలేక పోతున్నారు. ఆటోవాలాలు రెట్టింపు ప్రయాణికులను తరలిస్తూ ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారు. ఇష్టారాజ్యంగా ప్రయాణికులను ఎక్కించుకుని మితిమీరిన వేగంతో వెళ్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మామూళ్ల మత్తులో చూసీచూడనట్లుగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. మడకశిర డిపో పరిధిలోని అన్ని గ్రామాలు కలిపిన 120 గ్రామాల్లో మాత్రమే ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నట్లు సమాచారం. కొన్ని రూట్‌లలో నడిపే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు అధికంగా ఉన్న సమయంలో ఫుట్‌బోర్డు, టాప్ పైన ప్రయాణం చేస్తూ జనం ఇబ్బందులు పడుతున్నారు. కేవలం లాభం కోసం ఆర్టీసీ సర్వీసులు ఎంపిక చేసి నడుపుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులు, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఆర్టీసీ ప్రయాణం మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. ఆటో, టెంపోవాలాలు ఆర్టీసీ చార్జీల కంటే రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తారు రోడ్డు కలిగిన ప్రతి గ్రామానికి పల్లె వెలుగు సర్వీసులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.



బస్సులు లేక టాటాఏస్ వాహనంలో వెళ్తున్న ప్రయాణికులు

అవస్థలు తప్పడం లేదు



నియోజకవర్గం పరిధిలోని చాలా గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం ఉన్నా కూడా ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సు సర్వీసులు నడపడం లేదు. మడకశిరలో డిపో అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. రోజు 7 కిలోమీటర్ల దూరం నడచి వెళ్లాల్సి వస్తోంది. ఆటోల్లో మాత్రం పరిమితికి మించి రెట్టింపు సంఖ్యలో ప్రయాణాలు చేస్తున్నారు. ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు? అధికారులు చర్యలు తీసుకుని ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలి.

– హనుమంతరాయప్ప, టీడీ పల్లి గ్రామం, రొళ్ల మండలం

బస్సు సౌకర్యం కల్పించాలి



మా గ్రామం మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. అత్యవసర సమయంలో మండల కేంద్రానికి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నాం. అంతే కాకుండా గ్రామంలో దాదాపు 30 మందికి పైగా విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు రోజు నడచి వెళుతున్నారు. రొళ్ల మండల కేంద్రం నుంచి గుడ్డగురికి పంచాయతీ కేంద్రం గుండా వన్నప్పపాళ్యం, దాసప్పపాళ్యంతో పాటు జీఎన్ పాళ్యం మీదుగా ఆర్.రంగాపురం గేట్ వరకు తారు రోడ్డు ఉంది. అయిన కూడా పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు సర్వీసులు మాత్రం తిరగడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

– గోవిందరాజు, గుడ్డగురికి

వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు దిట్ట

- సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: ఎన్నికలకు ముందు మొసలి కన్నీరు కార్చడం, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే. వెన్నుపోటు పొడవటం, డైవర్షన్ రాజకీయాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ధ్వజమెత్తారు. శనివారం గోవిందాపురం, గుండుమల పంచాయతీల్లో మండల కన్వీనర్ రామిరెడ్డి, ఇన్‌చార్జ్ మంజునాథ్ అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పాలన వదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు, అరెస్టులతో కాలం వెళ్లదీస్తోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఒక్క రేషన్ కార్డు అందించిన పాపాన పోలేదన్నారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు చేసిన మోసాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు.కూటమి ప్రభుత్వంలో ప్రజలకు చేసిందేమీ లేదన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఇప్పటికీ ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గుర్తు చేసుకొంటున్నారని పేర్కొన్నారు.

సైనికుల్లా పని చేయాలి

రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి మాట్లాడుతూ.. జగనన్న కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని సంస్థాగతంగా మరింతగా బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ కమిటీల ఏర్పాటును ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు. మడకశిర నియోజకవర్గ గ్రామ, వార్డు కమిటీలు రాష్ట్ర స్థాయిలోనే మడకశిర పైలెట్ ప్రాజెక్టుగా నిలిచే విధంగా కమిటీలు ఉండాలన్నారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి, ఎంపీపీ కవిత, రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ యాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు తాళకేరమ్మ, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, తాలుకా యువజన అధ్యక్షుడు శేషాద్రి, బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, తాలుకా, మండల కమిటీల విభాగం అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, నాయకులు జయరాం, నాగేంద్రప్ప, రంగనాథప్ప, నాగరాజు, చిత్తప్ప, కుమార్, తిప్పారెడ్డి, సిద్ధలింగప్ప, జయప్ప, హనుమంతరాయప్ప, గంగాధర్, నాగేంద్ర, నాగరాజు, జయమ్మ, విజయమ్మ, జయరాజ్, బాలకృష్ణారెడ్డి, నాగభూషణ రెడ్డి, తిప్పేస్వామి, నగేష్, రంగనాథ్, నరసింహ, మంజు, పూలమూర్తి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గోవిందాపురంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు



ప్రత్యేక పూజల్లో పెద్ద చెరువుకట్ట ఆంజనేయుడు

అమరాపురం: తమ్మడేపల్లి, వలస, విరుపసముద్రం, హనుమంతనపల్లి, హలుకూరు, అమరాపురం ఆంజనేయస్వామి దేవాలయాలతో పాటు అమరాపురం, లక్కనపల్లి క్రాస్, ఆలదపల్లి శనీశ్వసామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆలయాల్లో స్వామి వార్లకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, తైలాభిషేకం, నవగ్రహ తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాదం అందజేశారు.

గుడిబండ: శ్రావణ శనివారం సందర్భంగా హిరేతుర్పి గ్రామంలో వెలిసిన ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. తొలుత ఆంజనేయస్వామి విగ్రహానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, గంగాజలం పోసి అభిషేకించారు. అనంతరం తులసీ పత్రంతో ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మడకశిరరూరల్: మండలంలోని ఆలయాల్లో శ్రావణ మాసం శనివారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. జిల్లెడుగుంట ఆంజనేయస్వామి ఆలయం నుంచి భక్తులు లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను భక్తిరహళ్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వరకు ఊరేగించారు. వివిధ గ్రామాల ప్రజలు స్వామికి జ్యోతుల ఉత్సవాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు ప్రసాదం అందజేశారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవాలు

అగళి: నరసబుంది, ఆలుడి, మధూడి గ్రామాల్లో శనివారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. శనీశ్వర స్వామి, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బియ్యం పిండితో చేసిన చెలిమిడిని జ్యోతులుగా చేసుకుని మేళతాళాల వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తరలివచ్చారు. ఆలయాల చుట్టూ ప్రదక్షణ చేసి జ్యోతులు సమర్పించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పెద్ద చెరువు కట్ట ఆంజనేయుడికి పూజలు

పెనుకొండ రూరల్: శ్రావణమాసం 3వ శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా పెద్ద చెరువు కట్ట ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, ఆకుపూజ,కుంకుమ అర్చనలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచేకాకుండా కర్ణాటక ప్రాంత వాసులు కూడా వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

అగళి: మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామికి శ్రావణ పౌర్ణమి సందర్భంగా పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి తిరువల నుంచి పవిత్రమాల వచ్చిన సందర్భంగా మాలతో అలంకంచి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యంలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

జేడీఎస్ ఆరోపణలు అవాస్తవం

పావగడ: పట్టణంలోని కుమారస్వామి లే అవుట్‌పై జేడీఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ సుదేశ్ బాబు తెలిపారు. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జేడీఎస్ నాయకుల ఆరోపణలు నిరాధారమని.. మూడు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు ఉండటంతో ఎన్నికల్లో లబ్ధి పొందడానికి అనవసర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కుమారస్వామి పేరుతో ఉన్న లే అవుట్.. గత 2009లో వెంకటరమణప్ప లే అవుట్‌గా నామకరణం చేయాలని సర్వసభ్య సమావేశంలో తీర్మానించామన్నారు. అప్పుడు జేడీఎస్ పార్టీకి చెందిన వారే మున్సిపల్ అధ్యక్షుడిగా ఉన్నారని గుర్తు చేశారు. 10 కాంగ్రెస్, 11 జేడీఎస్, 2 స్వతంత్రుల పార్టీల సంఖ్యాబలం ఉండేదన్నారు. అయితే ఇప్పుడు కేవలం ఒక జేడీఎస్ కౌన్సిలర్ మాత్రమే సభలో వ్యతిరేకించడం హాస్యాస్పదమన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రామాంజనప్ప మాట్లాడుతూ.. అప్పట్లో ఆశ్రయ లే అవుట్ నిర్మాణానికి మాజీ మంత్రి వెంకటరమణప్ప ఎంతో శ్రమించారన్నారు. ఆ ఆశ్రయ లే అవుట్‌కు వెంకటరమణప్ప పేరు పెట్టడం సరైన నిర్ణయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ అధ్యక్షుడు రాజేశ్ తదితర కాంగ్రెస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు సుదేశ్‌బాబు

పేట వేంకటరమణుడికి విశేష పూజలు

హిందూపురం: పట్టణంలోని పేట వేంకటరమణ స్వామి దేవస్థానంలో శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి సువర్ణ కవచంతో విశేషంగా వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి వెంకటరమణ ఉత్సవ మూర్తులను పల్లకీపై మేళతాళాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఇదిలా ఉండగా డీబీకాలనీలోని శనేశ్వరస్వామి ఆలయం స్వామికి తిల తైలాభిషేకాలు నిర్వహించారు. అలాగే జ్యేష్టాదేవి సమేత శనిదేవుడి ఉత్సవ మూర్తులను విశేష పుష్పాలంకరణలు చేసి ప్రాకారోత్సవం చేపట్టారు. ఉదయం, సాయంత్రం వందలాది భక్తులు ఆలయం ఎదుట తిల తైలాలతో దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

లేపాక్షి: శ్రావణ శనివారం సందర్భంగా కల్లూరు, మల్లిరెడ్డిపల్లి, కంచిసముద్రం, లేపాక్షి, కొండూరు, బోళసముద్రం, మానేపల్లి, పులమతి గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయాల నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.



అలంకరణలో వేంకటరమణస్వామి

నృసింహుడి సేవలో కేజీఎఫ్ ఎమ్మెల్యే



కేజీఎఫ్ ఎమ్మెల్యే రూప దంపతులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం కోలార్ (కేజీఎఫ్) నియోజకవర్గ ఎమ్మెల్యే రూప కుటుంబ సభ్యులతో కలసి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూప దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సాదరంగా ఆహ్వానించారు. పూలమాల వేసి శాలువా కప్పి మెమొంటో అందజేసి సన్మానించారు. లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే రూప తెలియజేశారు.

నేడు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్.అనంతపురం, ఆమిదాలగొంది పంచాయతీల్లో ఆదివారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, ఎంపీపీ కవిత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆర్.అనంతపురం, మధ్యాహ్నం ఆమిదాలగొంది పంచాయతీల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు హిందూపురం రూరల్‌లో ..

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం బాలంపల్లి, మలుగూరు, మణేసముద్రం గ్రామాల్లో ఆదివారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది. వైఎస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక హాజరవుతారని, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరింది.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

చిలమత్తూరు: మండలంలోని 544– ఈ జాతీయ రహదారి మరవకొత్తపల్లి బీసీ కాలనీ వద్ద శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఓ యువతికి గాయాలయ్యాయి. హిందూపురం వైపు నుంచి బాగేపల్లికి కారులో వెళుతున్న కారును వెనుక వైపు వచ్చిన కారు ఢీకొంది. కార్లు రెండూ పాక్షికంగా దెబ్బతిన్నాయి. క్షతగాత్రురాలిని వెంటనే బాగేపల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనపై ఆరా తీశారు.

యువతి అదృశ్యం

పెనుకొండ: వెంకటరెడ్డిపల్లి నుంచి పెనుకొండకు వెళ్లిన ఓ యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం అదృశ్యం కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం పట్టణానికి వెళ్లిన యువతి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

గర్భిణులకు వైద్య పరీక్షలు

లేపాక్షి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యులు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు గర్భిణులకు ఆరోగ్యసూత్రలను తెలియజేశారు. అనంతరం కరణం రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 65 మంది గర్భిణులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

ఏఐఎస్‌ఏ ఆవిర్భావ దినోత్సవం

మడకశిర: పట్టణంలో శనివారం ఏఐఎస్ఏ 35వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ నాయకులు జెండాను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు శశికుమార్ మాట్లాడుతూ.. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ మడకశిర కార్యదర్శి కన్యాకుమారి, ఏఐఎస్ఏ నాయకులు చిట్టి, నిగమ్య, విజయ్, భార్గవ్, చంద్రశేఖర్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: స్థానిక జూనియర్ కళాశాల బాలుర హాస్టల్‌లో ఏఐఎస్ఏ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, అనిల్, పునీత్, గణేష్, రోహిత్‌నాయక్, బన్నీ, మనోజ్, కమలాకర్ పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

మడకశిర/అమరాపురం: నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి 129 మి.మీ వర్షపాతం నమోదైంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో విస్తారంగా వర్షం కురవడంతో రైతులకు కాస్త ఊరట లభించింది. అమరాపురంలో 68.8, అగళిలో 19.6, రొళ్లలో 16.4, గుడిబండలో 14.2, మడకశిరలో 10 ఎంఎం చొప్పున వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఉచిత యజ్ఞోపవీత ధారణ



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హిందూపురం: పట్టణంలోని లక్ష్మీహయగ్రీవ ఆలయంలో ఉచిత నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం జరిగింది. ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉదయం లక్ష్మీ హయగ్రీవ స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ బ్రాహ్మణులు, వైశ్యులు తదితరులకు ఉచిత యజ్ఞోపవీత ధారణలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీ హయగ్రీవ స్వామి ఉత్సవమూర్తులను పల్లకీపై మేళతాళాలతో ఆలయ ప్రాకారోత్సవం చేపట్టారు.

ప్రారంభమైన పూజలు

పెనుకొండ: పట్టణంలోని మఠం వీధిలోని మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. శనివారం పౌర్ణమి వేడుకలు నిర్వహించగా, 10న పూర్వారాధన, 11న మధ్యారాధన, 12న ఉత్తరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.